చెడ్డపని చేసి మంచిని పొందలేరు
మంచి పని చేసి కీడును గాంచలేరు
నిమ్మమును నాటి చూతఫలంబు గనున
నిమ్మఫలంబును గనున చూతఫలంబు నాటి.

విద్యార్థులారా!

మనము భూమిలో ఏ విత్తనము నాటిన అదే మొక్కగా మారి అదే వృక్షముగా మారి ఆ ఫలములనే మనకందిస్తుంది. ఇది ప్రకృతి యొక్క స్వభావము. సృష్టి యొక్క రహస్యము. ఇది ఎవరు కాదన్నను, అవునన్నను ఈ సత్యము మారదు. కనుకనే మానవుడు చేసే ప్రతి కర్మకు ఫలితము ఉంది. ఎట్టి కర్మయో అట్టి ఫలితము. ఎట్టి విత్తనమో అట్టి మొక్క. విత్తనము ఒకటి అయితే మొక్క మరొకటి మొలవదు.

కనుకనే మానవుడు ఎట్టి కర్మలాచరించునో అట్టి ఫలములు అందుకో గలుగుతాడు. ప్రతి మానవుడు కూడ మంచి పనులు చేసి మంచి ఫలితము పొందటానికి ప్రయత్నించాలి. కాని ఈనాటి మానవుడు పుణ్య ఫలము కావాలని అమితంగా ఆశిస్తున్నాడు. కాని పుణ్య కర్మలాచరించటానికి ముందంజ వేయటం లేదు. పాప ఫలము తిరస్కరిస్తున్నాడు. కానీ పాప కర్మలు చేయుటకు ముందంజ వేస్తున్నాడు. ఇది మానవునియందున్న అజ్ఞానము. ఇది కేవలం ఒక మానవ ప్రభావమే కాదు. ప్రకృతి యొక్క ప్రభావం కూడా ఇందులో పాల్గొని తద్వారా మానవుని అనేక విధములుగా నడిపిస్తోంది. అనుభవించే బాధలను కష్టములను, దుఃఖములను పంచుకొనలేక ఓ భగవంతుడా! ఎందుకు నన్నిలా పరీక్షిస్తున్నావు, పరిశోధిస్తున్నావు. అని భగవంతుని మొరపెట్టుకుంటారు. భగవంతుడు సుఖమునుగాని దుఃఖమునుగాని అందించటం లేదు. నీవు అనుభవించే సుఖ దుఃఖములు నీ కర్మల యొక్క ఫలితములేగాని భగవంతుని ప్రసాదములు కావు. భగవంతుడు సాక్షీభూతుడు. భగవంతుడు కేవలం ఒక పోస్టుమెన్ వంటివాడు. నీకు ఏ కవరు వస్తే ఆ కవరు నీకందిస్తాడు. ఏ కార్డు వస్తే అది అందిస్తాడు. మనియార్డరు వస్తే అందిస్తాడు కానీ ఆ కవరు చించుకొని అందులో ఉండే సుఖదుఃఖాలు పొందేది నీవే కాని postman కాదు. అదే విధ

మగా నీవాచరించిన మంచి చెడ్డల ఫలితములు నీవు అనుభవిస్తున్నప్పుగానీ భగవంతుడు అను భవింపచేసేది, భగవంతుడు అందించేది కాదు. అయితే ఇక్కడ ఒక Special grace అనేది ఉంది. నీవు హృదయపూర్వకంగా, పవిత్రమైన భావములో, నిర్మలమైన హృదయములో, నిస్వార్థమైన క్రియలలో భగవంతుని స్మరించినప్పుడు భగవంతుడు ప్రత్యేకముగా ఇందులో పాల్గొని తను తగిన సహాయము చేస్తుంటాడు. అయితే మానవుని సుఖదుఃఖములకు కొంత మూలాధారం ఉంది. ఏ జన్మలో కానీ, ఏ పరిస్థితిలో గానీ భక్తులాచరించిన మంచి చెడ్డల ఫలితమును దృష్టియందుంచుకొని భగవంతుడు దానికి తగిన ఫలితము ప్రసాదిస్తూ ఉంటాడు.

ద్రౌపదిని దుర్యోధనుడు అనేక అవస్థలకు గురిచేసి నిండుసభలో అవమానించటానికి పూనుకున్నాడు. అప్పుడు ద్రౌపదికి ఏ సహాయము లేదు. కేశవా మాధవా మధుసూదనా అని ప్రార్థన చేసింది. ఈ కేశవుడెవరు? క-అ-ఈశ. కేశవ. క-బ్రహ్మ. అ-విష్ణు. ఈశ-ఈశ్వరుడు. ఈ బ్రహ్మవిష్ణుమహేశ్వర స్వరూపాన్ని ఎవరైతే తనయందుంచుకున్నాడో అతనే కేశవుడు. త్రిమూర్తి స్వరూపుడైన ఓ కేశవా. పరాశరుడు దీనిని మరొక రీతిలో వర్ణిస్తూ వచ్చాడు. కేశవ అనగా ఉంగరములలో చుట్టుకొనిన దట్టమైన ముంగురులు కల్గినవాడు. ఇతడెవరు? ఇతనే బ్రహ్మవిష్ణుమహేశ్వరస్వరూపుడు. ప్రార్థించింది. కృష్ణుడు విన్నాడు. ఈ ప్రార్థన నేను ఏరీతిగా స్వీకరించాలి? ఈ ప్రార్థనకు సంబంధించిన క్రియ ఏమైనా పూర్వము ద్రౌపది చేసిందా అని ద్రౌపది హిస్టరీ అంతా వెనుకకు తిరిగి చూచాడు. ఒక సంక్రాంతి దినము. ఆనాడు అందరు చెరకు నములుతూ ఉంటారు. ఆనాడు కృష్ణునితో చేరి ఆనందానుభూతులు పొందుతున్నారు. గోపికలు సత్యభామ, రుక్మిణి జాంబవతి ద్రౌపది. వీరినందరిని పరీక్షింపదలచి కృష్ణుడు కావాలని ఆ చెరకు చేస్తూ వేలును కోసుకుంటాడు. భగవంతుడు భక్తులను పరీక్షించటం అతని స్వభావము. కాని ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని తాను అనుగ్రహిస్తూ ఉంటాడు. చిన్నక్లాసులో ప్రైమరీస్కూలులో 1st standard లో పోవాలంటే test పెడతారు. ఇది అవునా కాదా అని test పెడతారు. ఇది ఏవిధమైన ద్వేషము తోగాని, వినోదముతోగానీ, అయిష్టముతోగానీ చేసే టెస్టులు కావు. భగవంతుడు అమితప్రేమ చేత, దయానుగ్రహము చేత, కరుణ చేత వారిని అనుగ్రహింపగోరి వారికి test ఇస్తుంటాడు. తన వేలునుండి రక్తము వచ్చింది. సత్యభామ చూచింది. రుక్మిణి చూచింది. జాంబవతి చూచింది. ద్రౌపది చూచింది. వీరందరు ఎంతో near and dear గా ఉండేవారు. దాసీలంతా దూరముగా ఉన్నారు. సత్య భామ చూచింది దాసిని పిలిచి బట్టతేసుకురా చుట్టటానికని అంది. రుక్మిణి స్వయంగానే పరుగెత్తి

30069603

వెళ్లింది లోపలకు. ద్రౌపది చూచింది. తాను కట్టుకున్న చీరకొంగు తీసి చించిది. కట్టు కట్టింది. కుడి చేతి వేలు తెగింది. దానికి చుట్టినది ద్రౌపది. ఇది చూచిన తక్షణమే సత్యభామ, రుక్మిణి ఒకరి కొకరు ముఖం చూచుకున్నారు. ద్రౌపది కున్న జాగ్రత్త మనకు లేకపోయిందికదా! ద్రౌపది యొక్క ప్రేమ మనలో లేకపోయిందికదా! మనం కేవలం శరీరమును మాత్రమే కోరుతున్నాము. అతని పరిస్థితి ప్రభావా లేమాత్రం మనం ఆశించటం లేదు. ఇది ద్రౌపది యొక్క భక్తిప్రపత్తుల ప్రభావము. ఆ వారిలో వారు సిగ్గుపడ్డారు. ఇదంతా చూశాడు కృష్ణుడు. ఆనాడు ద్రౌపది ఈ విధంగా నాకు సేవ చేసింది కనుక దీనికి నేను ప్రతి ఫలంగా అందించాలి అనుకున్నాడు. ఎప్పుడైనా ఈ ప్రాకృతమైన జగత్తులో ఏదైనా వస్తువును మనం పొందాలనుకున్నప్పుడు ఒక వస్తువు నందించి మరొక వస్తువు నందుకోవాలి. ఒక షాపుకి వెళ్ళి ఒక చేతిరుమాలు కావాలంటే పది రూపాయలు అతని కందిస్తే ఒక రుమాలు నిస్తాడు. అదే పద్ధతి భక్తునికి భగవంతునికి మధ్యనున్న సంబంధ బాంధవ్యము.

నీవు కించిత్తైనా భగవంతునికి అర్పిస్తే అనంతమైన ఫలితాన్ని భగవంతుడు నీకు అందిస్తాడు. కుచేలుడు పిడికెడు అటుకులు అందించగనే బహళ భాగ్యాన్ని అందించాడు. సత్యభామ కృష్ణుని అమ్మిన సమయంలో రుక్మిణి ఒక తులసిదళము పెట్టింది. పోల్చిస్తే

పత్రమో పుష్పమో ఫలమో తోయమో
భక్తి కలిగిన వానికి వశుడవగుటు
సత్యమని నీవు ఈ తులసిదళమునకు తూగుదువుగాక.

పత్రమో! ఏమిటి ఈ పత్రము? త్రిగుణములతో కూడిన పత్రము మరొకడు పత్రము ఈ దేహము. సత్వరజ తమో గుణములతో కూడిన దేహమే ఒక పత్రము. పుష్పము. హృదయ పుష్పము. నిర్మలమైన హృదయ పుష్పము. పవిత్రమైన సుగంధముతో కూడిన హృదయ పుష్పము. ఫలమో. మానసిక ఫలము. ఈ మానసిక ఫలమందు మధురమైన రసముంటుంది. కాని మధురరస తత్వము మనస్సు ఎరుగదు. ఫలములోని రసము చెట్టు ఎరుగదు. పువ్వులోని మకరందము తీగలు అనుభవించవు. పవిత్రమైన గ్రంథములలోని మధుర రసము ఈ ప్రాకృతమైన మానవులనుభవించలేరు కనుకనే రుక్మిణి ఆ పత్రమర్పితము చేసింది. ఆ తులసీ దళము అర్పితము చేయటం చేత బ్రహ్మాండ నాయకుడైన భగవంతుడు తూగగలిగాడు. ఎట్టి అపేక్షలు లేక నిరపేక్షా భావముతో రుక్మిణి కృష్ణుని చూస్తూ వచ్చింది. అదే విధంగా ద్రౌపది ఎటువంటి అపేక్షలేక నిరపేక్షతో కృష్ణుని

కానీ ఏవిధమైన త్యాగం చేసింది. కేశవా మాధవా దేవా మధుసూదనా! అని ప్రార్థించింది కన్నులు మూసుకొని. గొప్ప బలవంతులైన పతులు దగ్గరనే ఉంటున్నారు. మహావీరులు శూరులు. ఎవరు ఈమెను రక్షించలేకపోయారు. ఒక్క కృష్ణుడు తప్ప మరొకరు నాకు దిక్కులేరు అని ప్రార్థించింది. తాను చేసిన పూర్వ త్యాగము నకు తన వేలును చుట్టాడు. ఆ వేలుకు కట్టిన చిన్న గుడ్డ అక్షయంగా మారిపోయింది. కనుక కించిత్తైనా మనము భగవంతునికి చేసినప్పుడే అనంతముగా మనం భగవంతుని దగ్గర నుండి అందుకోటానికి వీలవుతుంది.

కర్మఫలము మనకు తప్పునదికాదు. అయితే దైవానుగ్రహము చేత ఎలాంటికర్మ ఫలమునైనా తప్పించుకోవచ్చు. అయితే దైవశాసనములో తప్పించుకొనుటకు వీలు కాదని మాత్రమే ఉంది. ఎట్టి కర్మయో అట్టి ఫలితము నీవు అనుభవించాలి.

కర్మదాట వశమా నరుడా కర్మదాట వశమా. ।కర్మ।
ఘనపాఠంబులు చదివినగాని
కులదేవతలను కొలచినగాని
కారడవులకే పోయినగాని
కఠిన తపస్సులే చేసినగాని ।కర్మ।
చిన్న చెలిమిలో ముంచినగాని
ఎన్ని సముద్రముల ముంచినగాని
ప్రాప్తెంతోరా నీకంతేరా
కావాలన్నను ఎక్కువ రాదుర. ।కర్మ

ఎంత పాత్రయో అంత నీరే చిక్కుతుంది. అయితే ఈ పాత్ర అధికము చేయుటమనేది భగవంతుని Special grace. అది లేక ఏ మాత్రము ఫలితము పొందలేము.

భుజబలంబు మరియు బుద్ధిబలంబుండి
దైవబలము లేక దీనుడయ్యె
కర్ణుడంతటి వాడు కడపటికేమయ్యె
మరువబోకు ఓర్పు మంచి మాట.

భుజబలముంది. బుద్ధి బలముంది. అస్త్ర శస్త్ర బలములంతా ఉంటున్నాయి. కర్ణునకు. కానీ దైవబలము

లేదు. కారణము ఏమిటి? దుస్సంగము చేత దుర్భావములు పెంచుకొని దుష్ట చతుష్టయములో ఒకడుగా మారిపోయాడు కర్ణుడు. దుర్యోధన, దుశ్శాసన, శకుని వరితో కూడటం చేత కర్ణుడు దుష్టుడుగా మారిపోయాడు. కనుక మనము చెడ్డ సంఘములో చేరరాదు. చెడ్డ సంఘములో చేరినప్పుడు చెడ్డ భావములే మనలో ఆవిర్భవిస్తాయి. చెడ్డ భావములు ఆవిర్భవించినప్పుడు చెడ్డ పనులలో మనం ప్రవేశిస్తాము. కనుక కంపెనీ చాలా ప్రధానమైనది. కర్ణుడు చాలా ధర్మపరుడు. కర్ణుని స్వభావము మరింత విచారించాలి. కర్ణుడు యుద్ధ భూమిలో కూలి పోయాడు. కర్ణుని ప్రభావము అర్జునునకు బోధించాలని కృష్ణుడు సంకల్పించుకున్నాడు. కారణం ఏమిటి? అర్జునుడు అహంకారములో ఉంటున్నాడు. నాకంటే గొప్ప అస్త్ర శస్త్ర విద్యలు నేర్చినవారు ఈ జగత్తులో లేడనుకున్నాడు. కృష్ణుడు నా ప్రియ మిత్రుడు, నా బావ మరది. నా ఇష్టము నెరవేర్చేవాడు అని గర్వము పెంచుకున్నాడు. ఆ గర్వము తీయని మార్గములో ఒకాగ దాక్కొ నిమిత్తమై కృష్ణుడు అర్జునుని వెంటబెట్టుకున్నాడు. కృష్ణుడు బ్రాహ్మణ వేషము ధరించాడు. కర్ణుడు క్రిందపడి చాలా అవస్థలకు గురౌతున్నాడు. దగ్గరకు వెళ్ళి కర్ణా! నీవు దానకర్ణుడవు. నా ఇంటిలో ఒక కార్యము సంకల్పించుకున్నాను. ఈ పరిస్థితిలో నిన్ను అడగటం న్యాయం కాదు. కానీ ధర్మాన్ని కోరి వచ్చాను. అప్పుడు కూడా క్రిందపడిన కర్ణుడు ఏమి కావాలో కోరుకోమన్నాడు. నాకు కించిత్ బంగారము కావాలన్నాడు. 'బ్రాహ్మణా! నా ఇంటికి వెళ్ళి నా భార్యను నేను చెప్పినట్లు చెప్పు. నా భార్య ఇస్తుంది బంగారు' అన్నాడు. 'నేను వ్యాపార నిమిత్తమై రాలేదు. నేరుగా నిన్ను అడగ నిమిత్తమై వచ్చాను. నీవు ఇస్తే ఇవ్వు అంతేగాని నీ భార్యను అత్తను మామను అడగమని చెప్పవద్దు' అన్నాడు. కన్నులు మూసుకున్నాడు కర్ణుడు. యుద్ధ భూమిలో తన దగ్గర బంగారు ఎక్కడుంది రెండు పండ్లకు బంగారు తొడుగు వేసుకున్నాడు. పూర్వకాలములో ఇది సహజమే. పండ్లకు రంధ్రము పడినప్పుడు పండ్లను బంగారుతో మూటవేస్తారు. కర్ణుడు 'బ్రాహ్మణా ఈ రెండు పండ్లు తీసుకుపో' అన్నాడు. ఏమిటి ఇది. నీ పండ్లు నేను తీయాలంటే సాధ్యమవుతుందా! నిన్ను హింసించి నేను పండ్లు తీసుకోవాలి. ఇది దానము ఎట్లా అవుతుంది? దానము కాదు. నేను నీ పండ్లను ముట్టను' అన్నాడు. 'అయితే రెండు రాళ్ళు తీసుకు రమ్మన్నాడు. రెండు రాళ్ళు తీసుకు వచ్చి ఇస్తే రాళ్ళతో రెండు పండ్లు కొట్టివేసి ఇచ్చాడు. 'రక్తమయమైన సువర్ణము నేనెట్లా ముట్టేది?' ఇంకా పరీక్షలు చేస్తున్నాడు. 'నీవు క్షత్రియుడవు. నీ ఎంగిలి నేను ఏ విధంగా ముట్టాలి. ఇది నా ఆచారమునకు విరుద్ధము' అన్నాడు. తక్షణమే బాణము తీసుకొని భూమిలో గట్టిగా వేశాడు. ఆ

గంగ పైకి ఉబికి వచ్చింది. తక్షణమే ఆ పండ్లను గంగలో కడిగి తుడిచి చేత్తో ఇచ్చాడు. కృష్ణుడు అర్జుని వైపు చూచాడు. అర్జునుడు శిరస్సు వంచుకున్నాడు. ఈ విధమైన త్యాగము, ఈ విధమైన దైవభక్తి ఈ విధమైన స్వభావము నేను ఎక్కడా చూడలేదు. ఇట్టి భక్తి ప్రపత్తులు నాలో ఏమాత్రమును కనిపించవు కృష్ణా నన్ను క్షమించు' అన్నాడు. అప్పుడు చెప్పాడు కృష్ణుడు ఈ కర్ణుడు ఎవరో తెలుసునా. నీ పెద్దన్న ధర్మరాజు కంటె ముందు పుట్టాడు కర్ణుడు. చాలా బాధ పడ్డాడు. ఈ మాట ముందుగా ఎందుకు చెప్పలేదు. నా స్వంత అన్నను అనేక విధములుగా బాధించాను. ధర్మజుని కంటె గొప్పవాడు కర్ణుడు.

ఈ విధముగా భగవంతునికి ఏదైనా ఇవ్వటానికి సంసిద్ధముగా ఉండే పరిస్థితి రావాలి ధర్మము. ప్రతి కర్మకు ఒక ఫలితముంటుంది. ప్రతి కర్మ ఒక విత్తనము. ప్రతి విత్తనము ఒక చెట్టు. ప్రతి చెట్టునందు ఫలములు వస్తాయి. ఆ ఫలములనే వృక్షము అందిస్తుంది. కనుక మనము పవిత్రమైన కర్మలాచరించటానికి పూనుకోవాలి. కర్మలు ఎట్టివో ఫలితములు అట్టివిగా ఉంటాయి. కానీ పాపము చేసే సమయంలో ఆనందముగా చేస్తుంటాము. కానీ అనుభవించేటప్పుడు కంటి ధారలతో అనుభవిస్తాము. మొదట మనము గుర్తించి ఏ కర్మలు మంచివి ఏ కర్మలు చెడ్డవి అని నిర్ణయము చేసికొని మంచి కర్మలలో మనం ప్రవేశించాలి. ఈనాడు ప్రకృతి ప్రభావము ముందు వెనుకలు యోచించకుండా కర్మలాచరిస్తాము. ముందు వెనుక విచారించక మాటలు చెబుతాము. కడపటికి ఫలితము వచ్చేటప్పటికి కృంగిపోతాము. ప్రపంచములో ప్రతి చర్య ప్రాకృతమైన చర్యయే. వర్షము కురిసింది. ఒకని కోసం కురిసిందా? కాదు. ప్రకృతిలోని ప్రతి మానవుని కోసం వర్షం కురిసింది. అందరికి చల్లదనము నందిస్తుంది. అందరికి దాహము తీరుస్తుంది. మలయమారుతము వీస్తుంది. ఇది ఒక్క మానవుని కోసం కాదు. అన్ని ప్రాణులకు. పంచభూతములు ప్రకృతి జీవులను రక్షించే కోసము వచ్చినవే. ఏ ఒక్కరి కోసము వచ్చినవి కావు. అదే విధముగా దైవము కూడా ఒక జాతి కోసము ఒక దేశము కోసము, ఒక వ్యక్తి కోసము వచ్చినది కాదు. విశ్వమును ఉద్ధరించటము కొరకు వచ్చినది. ఎవరు ఎట్టి కర్మలాచరింతురో అట్టి ఫలితము నందిస్తాడు.

మనము కర్మలాచరించుటకు పూర్వము కొంత కాలము వేచుకొని విచారించి మంచి కార్యములు చేయాలి. ఈ కర్మల వల్ల ఎవరికి ఏ విధమైన కష్టము, నష్టము కలగకుండా చూచుకోవాలి. అయితే జగత్తునందు ఇది అసాధ్యము. మానవత్వమనే అభిమానము పుట్టుకొని తుదవరకు కర్మలాచరించాలంటే వారికి సాధ్యము కాదు. దేహాభిమానము మరచిన వ్యక్తి మాత్రమే ఈ కార్యము చేయ

గలడు. ప్రకృతిని బట్టే మనకు దుఃఖము ప్రాప్తిస్తున్నది. ఈ ప్రకృతి మన దృష్టిని పట్టే వస్తుంది. దేహాభిమానము ఉండినంతవరకు ప్రకృతి ఉంటుంది. ప్రకృతి భావము ఉండినంతవరకు దుఃఖము వెంటాడుతుంది. ఎప్పుడు దేహాభిమానము పోతుందో అప్పుడు ప్రకృతి కూడా పోతుంది. ఎప్పుడు ప్రకృతి పోతుందో అప్పుడు దుఃఖము కూడా ఉండదు. జాగ్రదవస్థలో దేహాభిమానముంది. ప్రకృతి కనిపిస్తున్నది. సుఖ సంతోషములు మనము అనుభవిస్తున్నాము. సుషుప్తి గాఢ నిద్రయందు మన దేహమె మనకు లేదు. మన దేహమే మనకు లేనప్పుడు ప్రకృతి మనకు కనిపించదు. ప్రకృతి లేనప్పుడు మనకు దుఃఖము లేదు. ఒక్క నిద్రావస్థయందు సుఖదుఃఖములు లేవు. అదే విధముగా దైవచింతన చేత దేహాభిమానమును క్రమముగా తగ్గించుకుంటూ రావాలి. అప్పుడే ప్రాకృతమైన భావములు క్రమక్రమేణా తగ్గిపోతాయి. ప్రాకృతమైన భావములు ఎప్పుడు లేకుండా పోతాయో అప్పుడే మనకు దుఃఖము నివారణ అవుతుంది. దుఃఖములు, సుఖములు బయట నుంచి వచ్చేవి కావు. 'కాననంబున కాల్చిచ్చు వేములను గాల్చి మామిళ్ళను విడచి చను నా' అన్నింటిని కాల్చి వేస్తుంది. మనము దేహాభిమానము ఏనాడు తగ్గించుకుంటామో అప్పుడు సుఖము, దుఃఖము రెండూ ఉండవు.

'కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా'. అందులకే ఉపనిషత్తులు ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత అన్నారు. ఓ మానవుడా నీ అజ్ఞానమనే నిద్ర నుంచి మేలుకో. నీ సత్యము నీవు గుర్తించు. కేవలము నీవే సత్యస్వరూపుడవై ఉండి కూడను ఈ సత్యాన్ని గుర్తించుకోలేక తిరిగి సత్యము ఎక్కడో ఉంటున్నదని అన్వేషణ ప్రారంభిస్తున్నావు. ఇది ఎక్కడో బయట లేదు. ఆ సచ్చిదానందము నీవే. ఒక King ఉంటాడు. ఒక ప్రెసిడెంటు ఉంటాడు ప్రైమినిష్టరుంటాడు. నిద్రావస్థలో నేను Kingను, నేను ప్రెసిడెంటును, నేను ప్రైమినిష్టరును అనే భావము లేనే ఉండదు. కానీ మేలుకొన్న తరువాత నేను Kingను, నేను ప్రెసిడెంటును, నేను ప్రైమినిష్టరును అని చెప్పగలుగుతున్నాడు. ఈ అజ్ఞానమనే ప్రాకృతమైన భావమనే నిద్రలో నుండిన వానికి నేను సచ్చిదానంద స్వరూపుడను అని తెలియకుండా ఉంటుంది. నీవు మేలుకో. జ్ఞానమార్గములో నీవు మేలుకో. అప్పుడు సచ్చిదానంద స్వరూపుడవని గుర్తించుకోటానికి వీలవుతుంది. నిద్రలో ఉండినంతవరకు నీవు ఎవరో నీకే తెలియదు. మేలుకున్న తరువాతనే నీ పేరు నీ రూపము నీ హోదా అన్ని గుర్తించటానికి వీలవుతుంది. ఈనాడు ఎలా ఉంటున్నాము. ప్రాకృతమైన నిద్రలో

ఉంటున్నాము. భౌతికమైన నిద్రలో ఉంటున్నాము. లౌకికమైన నిద్రలో ఉంటున్నాము. అజ్ఞానమనే
నిద్రలో ఉంటున్నాము. కనుకనే మన సచ్చిదానంద స్వరూపమును గుర్తించుకోలేక పోతున్నాము.
నిద్రలో నన్ను పాము కరచింది. నిద్రలో కరచిన పాముకోసం అరస్తున్నావు. నిద్రలో కరచిన పామును
ప్రత్యక్షముగా పోయి మందు వేస్తే నివారణ అవుతుందా. నిద్రనుండి లేపుతే పాము కరచిన బాధ
తగ్గిపోతుంది. నిద్రలో నుండినంత వరకు పాము భయము బాధిస్తుంది. నిద్ర లేపుతే పాము భయ
ము ఉండదు. కరచిన గుర్తులుండవు. ఈ నాడు అజ్ఞానమనే నిద్రలో ఉంటున్నాము. దేహాభిమానమనే
నిద్రలో ఉంటున్నాము. లోకాభిమానమనే నిద్రలో ఉంటున్నాము. దుఃఖం అసుఖం లోకం. ఇది ఒక
నిద్రవంటిది. నిద్రలో బాధలు అనుభవిస్తున్నాము. దీనికి ఔషధము ఏమిటి? పరిహారము ఏమిటి?
అజ్ఞానమనే నిద్రనుండి మేలుకోటమే. ఇవన్నీ దేహాభిమానముతో కలసి వస్తున్నాయి.

క్రమక్రమేణా దేహాభిమానమును తగ్గించుకుంటూ రావాలి. అప్పుడే మన ఆనంద
ము పెరుగుతూ వస్తుంది. ఎంత అభిమానము తగ్గించుకుందుమో అంత ఆనందము లభ్యము
వుతుంది. ఆనందమును అనుభవించగోరే ప్రతి వ్యక్తి ఈ అభిమానమును తగ్గించుకుంటూ
రావాలి. అభిమానమునకు తోడుగా అహంకారము ప్రారంభమవుతుంది. ఏ ద్రవ్యల చేతనో లేక
ధనము చేతనో లేక భుజ బలము చేతనో, జన బలము చేతనో ఏదో ఒక విధంగా అహంకారము
మనలో ఆవిర్భవిస్తుంది. మనం ఎంత పెరుగుతూ పోతే అంత అభిమానము, అహంకారము అంత
తరుగుతూ రావాలి. మేఘములలో నీరు నిండినప్పుడు మేఘములు భారమై క్రిందికి దిగుతాయి.
ఒక చెట్టుకు అమితంగా కాయలు కాచినప్పుడు కొమ్మలంతా వంగిపోతాయి. అయితే ఈ నాటి
మానవుడు దేనిపై ఆధారపడి ఉన్నాడు. చక్కగా విచారించి చూస్తే చిన్న పక్షి కొమ్మపై వాలి
ఉంది. కొమ్మ అటూ ఇటూ ఆడినా పక్షి ఏమాత్రము భయపడదు. కారణం ఏమిటి? 'నేను
రెక్కలనాశ్రయించాను కొమ్మ ఊగనీ, కాలనీ, కూలనీ నా రెక్కలు భద్రంగా ఉంటున్నాయని రెక్కలపై
విశ్వాసము చేత కొమ్మపైన కూర్చొ గలుగుచున్నది. కాని ఈ నాడు పక్షికున్న విశ్వాసము మానవు
నికి లేదు. సంసారమనే వృక్షముపై బాధలు కష్టములు కలిగినప్పటికి తాను భయపడిపోతు
న్నాడు. కారణం ఏమిటి? ఆత్మవిశ్వాసము కోల్పోవటం. తనపై తనకు విశ్వాసము లేకపోవట
మే. పక్షికి తన రెక్కలపై తనకు విశ్వాసముందిగాని మానవునకు ఆత్మవిశ్వాసము లేకుండా
పోతున్నది. ఏ కించిత్ కష్టమునకైనా కృంగిపోతున్నాడు మానవుడు. కించిత్ బాధలకు కృంగి

30069609

పోతున్నాడు మానవుడు. దేనిని భరించుకోలేక పోతున్నాడు. సహించుకోలేక పోతున్నాడు. కనుక పక్షులు మృగములు సహజమైన జీవితము అనుభవించుటం చేత ఆత్మధైర్యముగా సాహసంగా కార్యాలు సాధిస్తూ పోతున్నాయి.

ఈనాటి మానవుడు తన బుద్ధి బలముపైన భుజ బలముపైన, ధనబలముపైనను ఆధారపడి ఉంటున్నాడు. ఆత్మ బలము నాశ్రయించుకోలేడు. ఆత్మ విశ్వాసము ఒక్కటి ఉంటే సర్వము సాధించవచ్చు. ఈ ధనబలము వస్తుంది పోతుంది. జనబలము. జనబలము ఎంతవరకు. నీవు అధికారముతో సిరిసంపదలతో తులతూగుతున్నంత వరకు బంధువులంతా వెంట ఉంటారు. తదుపరి జగత్తు ఎల్లా గౌరవిస్తుంది. ఆత్మ బలము ఒక్కటి ఉంటే సర్వబలములు చేకూరుతాయి. ఈనాడు ఆత్మబలము చేత, దైవబలము చేత జీవించుటకు పూనుకోవాలి. ఆత్మను విశ్వసించి మంచికర్మలు ఆచరించుటానికి ప్రయత్నించాలి. కర్మలు ఎట్టివో ఫలితములట్టివి. తిండి ఎట్టిదో త్రేపు అట్టిది. పిండి ఎట్టిదో రొట్టె అట్టిది. ప్రతి మానవుడు సత్కర్మలలో ప్రవేశించి సదానందమును అనుభవించాలి. సత్ లోకములో చేరాలి. ఇదే మానవుని ప్రధాన గమ్యము. ఇదే మానవుని ప్రధాన లక్ష్యము. కేవలం చెడ్డపని చేసి మంచిరావాలంటే ఇది రావటానికి వీలు కాదు. మంచి చేయండి. దైవత్వమునకు అత్యంత సమీపముగా పోవటానికి కృషి చేయాలి. ఒక్కొక్క అడుగు దైవమునకు సన్నిహితంగా ఉండాలి. మనము వేసే ప్రతి అడుగు దైవమునకు సమీపముగా పోవాలి. అప్పుడే మనము విజయమును సాధించగలము.